క్లుప్తంగా

నిర్లక్ష్యంగా పారిశుద్ధ్య కార్మికులు

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలో రాత్రి సమయంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఊడ్చిన చెత్త ఉదయానికి మరలా రోడ్డుపైకి రావడం గమనార్హం. ఒక పక్క కార్పొరేషన్ అధికారులు స్వచ్ఛ మంగళగిరి అంటూ ప్రత్యేక ప్రణాళిక నిర్వహిస్తుంటే రాత్రి సమయంలో పారిశుద్ధ్య కార్మికులపై నిఘా లేకపోవడంతో కొంతమంది కార్మికులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేవారు రోడ్డుపక్కనే ఉన్న చెత్తను రోడ్డు మార్జిన్‌కు అనుకుని ఉన్న షాపుల్లోకి ఊడుస్తున్నారు. ఉదయం షాపు తెరిచిన యజమానులు ఆ చెత్తను తిరిగి రోడ్డుపైకి ఊడుస్తున్నారు. ఫలితంగా ఆ చెత్తంతా రోడ్డుపైనే పేరుకుపోతోంది. రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్మికులపై అధికారులు పర్యవేక్షణ ఉంచాలని.. అప్పుడే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు కోరుతున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



ఫిరంగిపురం: పీహెచ్‌సీలో ప్రజలకు సిబ్బంది మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని గుంటూరు ఆర్డీ డాక్టర్ సుచిత్ర అన్నారు. మండలంలోని సుదురుపాడు పీహెచ్‌సీని గురువారం ఆమె పరిశీలించారు. లెప్రసీ, ఇమ్యూనైజేషన్, ఓపీ, హాజరు పట్టిక రికార్డులు పరిశీలించారు. ప్రసవాల వివరాలను వైద్యురాలు యానీగ్రేస్‌ను అడిగి తెలుసుకున్నారు. హైరిస్కులు లేకుండా చూసుకోవాలని, తల్లి, పిల్ల క్షేమంగా ఉండేలా వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. సీహెచ్‌వో వెంకటలక్ష్మి, కె.సుదర్శన్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వ సభ్య సమావేశం నేడు

దుగ్గిరాల: మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో షేక్.జబీన్ అధ్యక్షతన కార్యక్రమం ఉంటుందన్నారు. సభ్యులందరూ హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన

మంగళగిరి టౌన్: ప్రస్తుత కాలంలో పెరిగిన ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు కలుగుతోందని.. ఇక ముందు ప్లాస్టిక్ వాడకంపై పలు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని మంగళగిరి నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. ఎంటీఎంసీ కార్యాలయంలో గురువారం స్వయం సహాయక సంఘాల(ఆర్పీలు)కు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించే దిశగా చేతి సంచుల తయారీ, అరటి ఆకులతో టిఫిన్ ప్లేట్లు, ప్రత్యామ్నాయం తీసుకు వచ్చే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, శానిటేషన్ ఎక్స్‌పర్ట్ ఉదయ్‌సింగ్, ఎంటీఎంసీ డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆర్పీలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత ఫలితాలు



ఫిరంగిపురం: క్రమ శిక్షణతో ఉన్నత ఫలితాలు సాధించవచ్చని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని శాంతిపేటకు చెందిన డి.నిషా స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాల పది ఫలితాల్లో 587 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నిషాకు ఆమె గురువారం మెమెంటో అందజేసి అభినందించారు.

కార్మికుల కష్టార్జితాన్ని దోచుకోవడం అన్యాయం

తాడేపల్లి రూరల్: ఎ.సి.సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాన్ని యాజమాన్యం దోచుకోవడం అన్యాయమని యూనియన్ నాయకులు కె.స్టీవెన్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఎ.సి.సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు. స్టీవెన్ మాట్లాడుతూ.. దాదాపు 30 ఏళ్ల కిందట సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లాకౌట్ ప్రకటించిందని.. ఆ నాటి కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు రావాల్సిన బకాయిలు మాత్రం యాజమాన్యంతో చర్చలు జరిపి ఇప్పించలేక పోతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం నాయకులు కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్.సుబ్బారావు, గురవయ్య, హగ్గయ్య, ఇమాంబి, లక్ష్మి, సారమ్మ, శివ కుమారి, సువర్ణ కుమారి, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో సమస్యల తిష్ట!

- కన్నెత్తి చూడని అధికారులను నిలదీసిన స్థానికులు
- సమస్యలను పరిష్కరించడంలేదని ఆగ్రహం

ఆత్మకూరు(మంగళగిరి): నగర పరిధిలోని ఆత్మకూరు ఎస్సీ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. కాలనీలోని సమస్యలను వినేందుకు అధికారులకు ఎవరూ రావడం లేదు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ మంగళగిరిలో భాగంగా నగర పాలక సంస్థ అధికారులు ఆత్మకూరులో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రోడ్లను శుభ్రపరిచారు. కానీ.. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ చెత్తతో పూడిపోయి.. రోడ్లపై మురుగు నీరు చేరినా పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు ఇటుగా కన్నెత్తి చూడలేదు. తమ కాలనీలోని సమస్యలను పట్టించుకోకుండా వెళ్లడంతో స్థానికులను ఆగ్రహానికి గురయ్యారు. దీంతో స్థానికులు అధికారుల వాహనాన్ని అడ్డగించి ఎస్సీ కాలనీలో సమస్యలు పట్టవా అంటూ నిలదీశారు. కాలనీలో సమస్యలను వినేందుకు అధికారులకు ఓపిక లేదని స్థానికులు వాపోయారు.

సరిగా లేని డ్రైనేజీ వ్యవస్థ..

కాలనీలో డ్రైనేజి వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు కాలువలు చెత్తతో నిండి పోతున్నాయి. ఫలితంగా మురుగు నీరు రోడ్లపైకి చేరుతుంది. దీంతో దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నాం అంటూ స్థానికులు వాపోయారు. కుక్కల బెడద అధికంగా వుందని.. చెత్త తీసేవాళ్లు 10 రోజులకు ఒకొసారి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు సైతం రెండు లేదా మూడు రోజులకు ఒకొసారి ముందస్తు సమాచారం లేకుండా సరఫరా చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



అధ్వానంగా మురుగు కాలువ



కాలనీలోని మురుగు కాలువలో చెత్త

అధికారులు వినడం లేదు..



కాలనీలో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. వెంటనే డ్రైనేజీలలో చెత్త తీయాలి. అధికారులు పట్టించుకోకుండా వెళుతున్నారు. స్థానికులు సమస్యలను విన్నవించుకుందామంటే అధికారులు వినడం లేదు. అధికారులు వెంటనే కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి.

పులివర్తి రత్నం, స్థానికుడు

అనారోగ్యం పాలవుతున్నాం..



తాగునీరు సరఫరా ఎప్పుడంటే అప్పుడు చేస్తున్నారు. కూలీ చేసుకునే పేదలు తాగునీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అధికారుల దృష్టికి సమస్యలను ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. చెత్త పేరుకుపోవడంతో దోమలు ప్రబలి అనారోగ్యం బారిన పడుతున్నాం.

బండపల్లి మేరిమ్మ, స్థానికురాలు

కేఎల్‌యూలో కార్యశాల కార్యక్రమం

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కె.ఎల్ యూనివర్సిటీలో కె.ఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సహకారంతో గురువారం 'ది యంగ్ టెక్ ఎంటర్‌పెన్యూర్ ఒకరోజు కార్యశాల'ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎ.సి.ఐ.సి కె.ఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ సి.ఇ.వో. రామణ్‌కాంత్ వల్లభనేని మాట్లాడుతూ.. రానున్న తరంలో సాంకేతికతతో నడిచే ఆవిష్కర్తలను ప్రేరేపించడానికి ఈ కార్యశాల ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కె.ఎల్.టి.ఫ్ సి.ఇ.వో. బాబు హరికృష్ణ తన వ్యవస్థాపక ప్రయాణాన్ని పంచుకున్నారు. కె.ఎల్ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ ఒక ఎంపిక కాదని, ఇది ఒక అవసరమన్నారు. వ్యవస్థాపక ఆలోచనలతో నడిచే 5 ప్రభావవంతమైన ప్రాజెక్టులను ప్రదర్శించి అంకుర సంస్థల ఏర్పాటు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఎస్.పి రోడాక్స్ సి.ఎ.వొ మాదాల భరత్‌కుమార్ అంకుర సంస్థల ఏర్పాటుపైన విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో ఛాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాధరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కె.ఆర్.ఎస్ ప్రసాద్, ప్రముఖ వ్యవస్థాపకులు లక్ష్మీపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న ప్రో ఛాన్సలర్ డాక్టర్ కె.ఎస్ జగన్నాధరావు

ఆశ్రమం నుంచి ఇంటికి చేరాడు

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: మానవత్వమా...నీ జాడెక్కడ...శీర్షికన ఈనెల 24న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం సేవాసదనంలో చేర్చిన వ్యక్తిని ఇంటికి చేర్చింది. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండల గ్రామం అనంతవరానికి చెందిన దావులూరి రాధాకృష్ణమూర్తి (65) స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసోలేషన్ గదిలో దిక్కూమొక్కూ లేకుండా పడివుండటం, స్వచ్ఛంద సేవాసంస్థ 'హెల్పింగ్ సోల్జర్స్' అతడిని గమనించి, మంచినీరు, ఓఆర్ఎస్ ఇచ్చి ఆహారం ఇచ్చారు. అప్పుడు తన పేరు దావులూరి రాధాకృష్ణమూర్తి అనీ, అనంతవరం గ్రామమనీ, ముగ్గురు బిడ్డలు ఉన్నారనీ ఆయన వివరాలు తెలియజేశారు. పెద్దగా అరుస్తూ బట్టలు వేసినా తీసేస్తున్నాడనీ, రోగులను ఏదైనా చేస్తారనే భయంతో సిబ్బంది అతడిని ఐసోలేషన్ రూమ్‌లో చేర్చినట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఇదే విషయంపై 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని రాధాకృష్ణమూర్తి సోదరులు చూశారు. తెనాలిలో జరిగిన ఎడ్లపందేలకని వెళ్లిన తమ్ముడు ఇప్పటివరకు రాకపోవటంతో అతడి ఆచూకీ కోసం వారు అన్వేషిస్తున్నారు. పత్రికలో చూశాక తెనాలి జిల్లా ఆసుపత్రికి వెళ్లి ఆరా తీశారు. గుంటూరు దగ్గర్లోని గోరంట్లలో గల కార్మెల సదన్‌లో చేర్చామని తెలుసుకుని, అక్కడకు వెళ్లారు. వివరాలను తెలియపరచి తమ సోదరుడిని అప్పగించాలని దావులూరి రామలింగయ్య లిఖితపూర్వకంగా సదన్ నిర్వాహకులను కోరారు. దీనితో కథ సుఖాంతమైంది.



కార్మెల్ సదన్‌లో రాధాకృష్ణమూర్తితో సోదరుడు

జనజీవన జాగృతి జగ్జీవన్‌రామ్

తెనాలి: జనజీవన జాగృతి భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవనరామ్ అని బీజేఆర్ (బాబు జగ్జీవన్‌రామ్) కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ అన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లో గురువారం బాబు జగ్జీవన్‌రామ్ సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ బయోపిక్ నిర్మాణంలో ఉన్న నేపథ్యంలో బీజేఆర్ కమిటీ సారథ్యంలో బీజేఆర్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేయనున్న సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గౌరవఅతిథిగా పాల్గొన్న చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ 2025లోనే జగ్జీవన్‌రామ్ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాల్లో ఉన్నట్టు చెప్పారు. జగ్జీవన్‌రామ్ పాత్రధారి మిలటరీ ప్రసాద్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ పాత్ర పోషించే అవకాశం రావటం తన అదృష్టమన్నారు. రావి కృష్ణమోహన్ (చిన్ని), బీజేఆర్ కమిటీ సభ్యులు బడుగు సురేష్, గాజుల వట్టి రాజేష్, చిలక రత్నరాజు, జితేంద్ర, కోట లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన మేకల సురేష్, పక్కన దిలీప్‌రాజా, మిలటరీ ప్రసాద్, కృష్ణమోహన్

జాతీయ స్థాయిలో ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రతిభ

తాడేపల్లి రూరల్: ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఉత్తర ప్రదేశ్ ఘజియాబాద్‌లో నిర్వహించిన ఫైనల్ కొలేప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్) బృందం ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని సాధించినట్లు ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి గురువారం తెలిపారు. దేశవ్యాప్తంగా 8 టీమ్‌లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాయన్నారు. వివిధ రాష్ట్రాల టీమ్‌లతో పోటీపడి వారికి ధీటైన పోటీ ఇచ్చి తృతీయ స్థానం కైవసం చేసుకోవడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. బృందం సభ్యులను రాష్ట్ర డి.జి.పి హరీష్‌కుమార్ గుప్త, పలువురు ఐజీలు, పోలీస్ విభాగ అధికారులు అభినందించారు.



తృతీయ స్థానం పొందిన బృంద సభ్యులతో ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి

ప్రారంభమైన విరామ బైబిల్ తరగతులు



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఇమ్మానుయేలు చర్చిలో గురువారం వేసవి విరామ బైబిల్ తరగతులను ప్రారంభించినట్లు చర్చి పాస్టర్ రవిప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సండేస్కూల్ చిన్నారులకు బైబిల్ పాఠాలు, క్రాఫ్ట్స్, గేమ్స్, యాక్షన్ సాంగ్స్, పెప్పెట్‌షో, డ్రాయింగ్, మ్యాజిక్‌షో తదితర ఆటలను నేర్పిస్తామన్నారు. రోజూ చిన్నారులకు అల్పాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణా తరగతులు మే 1వ తేదీ వరకు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో అభిషేక స్వరం టీవీ వర్తమానికులు పాస్టర్ యం.జాన్ వెస్లీ, కట్టిపోగు బసవరావు, అచలరాణి, దీవెన, శాంసన్, గ్రేసీ ఏంజల్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ కమిటీ డైరెక్టర్లుగా కూటమి కార్యకర్తలు



దుగ్గిరాల: రాష్ట్ర హజ్ కమిటీలో డైరెక్టర్లుగా కూటమి కార్యకర్తలు, తమ కార్యాలయ రిసెప్షనిస్టులను నియమించడం హజ్ కమిటీ పవిత్రతను దెబ్బతీసేలా ఉందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా విభాగం ప్రధాన కార్యదర్శి షేక్.సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్ నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్లామిక్ దార్మిక పండితులను నియమించాల్సిన స్థానంలో రాజకీయ వర్గాలను నియమించడం సరికాదన్నారు. సెంట్రల్ హజ్ కమిటీ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ఇస్లాం పండితులను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

మంగళగిరి: ద్విచక్రవాహనాలను చోరీ చేసే నిందితుడిని మంగళగిరి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని రత్నాలచెరువుకు చెందిన ఆగ్జర్ ఆలీ అనే నిందితుడుని నుంచి 8 ద్విచక్రవాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆలీని విచారించగా.. తాను ద్విచక్రవాహనాలు కొనుగోలు చేస్తాడని.. తనకు వేరే యువకులు చోరీ చేసిన ద్విచక్రవాహనాలను తీసుకువచ్చి విక్రయిస్తారని తెలిపాడు. దీంతో మిగిలిన నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభం

తెనాలి: స్థానిక గాంధీనగర్‌లోని శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రంలో 348వ ఉచిత యోగ శిక్షణ శిబిరం గురువారం ప్రారంభించారు. యోగ గురువు కూనల బాప్‌లాల్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజూ యోగ చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులు కాగలరని చెప్పారు. సేవాకేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉచిత యోగ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూర్యోదయానికి ముందే యోగ చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ఆర్.భార్గవ్, యోగ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనల బాప్‌లాల్

పహల్గాం టెర్రరిస్టులను మట్టుబెట్టాలి

మంగళగిరి టౌన్: పహల్గాం దాడి సంఘటనకు కారకులైన టెర్రరిస్టులను భారత భద్రతా దళాలు త్వరలోనే మట్టుబెడతాయన్న ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని బైపాస్‌రోడ్డ వద్ద గల రాష్ట్ర కార్యాలయంలో గురువారం పహల్గాం దాటిలో అసువులుబాసిన వారికి సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు సంతాపం తెలియజేశారు.కేశన శంకరరావు మాట్లాడుతూ.. మృతుల్లో మన రాష్ట్రానికి చెందిన శ్రీకాకుళం జిల్లా వాసి చంద్రమౌళి, కావలి నివాసి మధుసూధనరావు ఉండడం తెలుగువారిని మరింత బాధిస్తోందన్నారు. టెర్రరిస్టుల ఘాతుకానికి బలైన మృతులందరినీ అమరవీరులుగా ప్రభుత్వం పరిగణించాలని కోరారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి అశోక్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంతాప సభలో మౌనం వహిస్తున్న రాష్ట్ర బీసీ సంఘం నాయకులు

మంగళగిరి: ఉగ్రవాదుల చేతిలో అసువులుబాసిన పర్యాటకులకు గురువారం పట్టణంలోని ఏకోపార్కులో వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మౌనం వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు వీసం వెంకటేశ్వరరావు, రాజు, రంగిశెట్టి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులపై క్రీడాకారుల నిరసన

తాడేపల్లి రూరల్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా పలువురు క్రీడాకారులు గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో జరుగుతున్న ఉండవల్లి క్రికెట్ లీగ్ పోటీల వద్ద క్రీడాకారులు మైదానంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ.. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. భారతీయులందరూ ఐక్యంగా ఉండి ఉగ్రదాడులలో మృతి చెందిన కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. అనంతరం మృతిచెందిన వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు జొన్న రాజేష్, క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సభ్యులు జయరామ్, నవీన్, నాగార్జున, నవీన్, అంజి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన చేపడుతున్న క్రీడాకారులు

నిడమర్రులో కొవ్వొత్తుల ర్యాలీ

నిడమర్రు(మంగళగిరి): పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా నగర పరిధిలోని నిడమర్రులో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సి.పి.ఎం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పాల్గొని మాట్లాడారు. ఆనందంగా కుటుంబాలతో గడుపుతున్న పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సంతాపం తెలియజేసి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రవి, ఎం.భాగ్యరాజ్, గైరుబోయిన నాగేశ్వరరావు, ఎం.రాజముని, ఎం.కోటేశ్వరరావు, కె.స్టాలిన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకుల

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని.. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో గురువారం కార్మికులు జాతీయ రహదారి వెంట ర్యాలీ నిర్వహించి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కె.పవన్ కళ్యాణ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు గత 8 ఏళ్లుగా జీతాలు పెంచలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా రూ.24,500 జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. టెండర్ల విషయంలో హైకోర్టు తీర్పు అమలు చేయాలన్నారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపచేయాలని కోరారు. అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న పవన్ కళ్యాణ్ పది నెలలు గడుస్తున్నా కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకట్రామయ్య, ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు, జి.రామాంజనేయులు, కోశాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జనసేన కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

దోమల నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి

గుంటూరు మెడికల్: ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తన చాంబర్‌లో వైద్యాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచుకోవాలని తెలిపారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. హాస్టల్, స్కూల్స్‌లో డోర్లకు మెష్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గనుల ప్రాంతాల్లో, క్వారీల్లో, నిలువ నీటిలో మలేరియా ఆయిల్ బాల్స్‌ని ఉపయోగించుకోవాలని సూచించారు. సాయంత్రం సమయంలో దోమలు ఇళ్లలోకి రాకుండా తలుపులు, కిటికీలు మూసివేయాలని తెలిపారు. ఒంటినిండా కప్పివుండే దుస్తులు ధరించి, ప్రతి ఒక్కరూ తప్పకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అందరు పరస్పర సహకారంతో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్ని నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్. రవి బాబు, జిల్లా పంచాయతీ ఆఫీసు, జిల్లా విద్యాశాఖ, జిల్లా మత్స్య శాఖ, గనుల శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

విద్యాహక్కు చట్టం ద్వారా 25 శాతం ప్రవేశాలు

దుగ్గిరాల: అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో రానున్న విద్యాసంవత్సరం 2025–26కు విద్యాహక్కు చట్టం–2009 ద్వారా 25 శాతం ఉచిత ప్రవేశాలు ఉంటాయని ఎంఈఓ కె.శ్రీనివాసరావు అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఆర్.టి.ఇ.–2009, సెక్షన్ 12(1)సి, ప్రకారం తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1,20,000.. పట్టణ ప్రాంతాలలో రూ.1,44,000 మించకుండా ఉన్న వారి పిల్లలు అర్హులని అన్నారు. 1వ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 28న నుంచి మే 15వ తేదీ వరకు ప్రాథమిక వివరాలతో http//cse.ap.gov.in వెబ్‌సైట్ నందు రిజిష్టర్ చేసుకోవచ్చు అని తెలిపారు. లాటరీ ద్వారా సీట్లు కేటాయింపు జరుగుతుందని అన్నారు.